క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

వీరవాసరం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల ప్రకారం వీరవాసరం మండల అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు అందాయి. వీరవాసరం మండల యువజన విభాగం అధ్యక్షుడిగా వీరవల్లి ప్రవీణ్ కుమార్, మండల మహిళా విభాగం అధ్యక్షురాలిగా పాల లక్ష్మికుమారి, మండల రైతు విభాగం అధ్యక్షుడిగా నాగరాజు గోపాలకృష్ణంరాజు, మండల బీసీ సెల్ అధ్యక్షుడిగా కడలి శ్రీరాములు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మారంపూడి సురేష్, మండల ఎస్టీసెల్ అధ్యక్షుడిగా సాలా అంజి, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షేక్ సత్తార్ సాహెబ్, మండల క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా మైలాబత్తుల రవికుమార్, మండల స్టూడెంట్ విభాగం అధ్యక్షుడిగా బందెల సునీల్, మండల పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా పులగం సుబ్రహ్మణ్యం, మండల వాణిజ్యభాగం అధ్యక్షుడిగా తాళ్లూరు జయరాం, మండల వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడిగా గెడ్డం ముసలయ్య, మండల సోషల్ మీడియా అధ్యక్షుడిగా ఆదిరెడ్డి అప్పారావు, మండల పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా బొల్లంపల్లి శ్రీనివాసులను నియమించారు.

నాణ్యమైన పశువుల దాణాతో అధిక పాల ఉత్పత్తి



పశువుల దాణా పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆకివీడు: నాణ్యమైన పశువుల దాణాతో అధిక పాల ఉత్పత్తిని పొందవచ్చని మండల పశు సంవర్ధక శాఖ అధికారి కెల్లా భార్గవీ సత్య చెప్పారు. మండలంలోని అయిభీమవరం, గుమ్ములూరు కేంద్రాలుగా పలు గ్రామాల రైతులకు గురువారం రెండో విడత పశు దాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాభై శాతం సబ్సిడీతో దాణా అందజేస్తున్నామన్నారు. మొదట విడతలో పంపిణీ చేసిన దాణా వల్ల పాల దిగుబడి పెరిగిందని రైతులు చెప్పినట్లు ఆమె తెలిపారు. రైతులు దాణాను ప్రతి రోజూ కేజీ నుంచి రెండు కేజీల లోపు పశువుల సామర్థ్యాన్ని బట్టి పెట్టాలన్నారు. ఎండుగడ్డి, పచ్చిగడ్డితో పాటు దాణా వేయాలన్నారు. పశువుల్లో బలవర్ధకమైన ఆహారం కావడం వల్ల లేగదూడల్లో బలం, ఎదకు సకాలంలో వచ్చే అవకాశం ఉందని ఆమె వివరించారు.

యోగా గురువులకు సత్కారం



భీమవరంలో యోగా గురువులను సత్కరించిన దృశ్యం

భీమవరం: గురుపూజోత్సవం సందర్భంగా భీమవరం పట్టణంలోని కృష్ణదేవరాయ పతంజలి యోగ మిత్ర మండలి ఆధ్వర్యంలో కృష్ణదేవరాయ సాంస్కృతిక సమితి భవనంలో వివిధ యోగకేంద్రాల గురువులు రామాయణం రమేష్‌బాబు, జెట్టి రామకృష్ణ, గొర్లి సీతారామయ్య, గండ్రెడ్డి కృష్ణ, తటవర్తి ఫణీంద్ర, పాపోలు ఏడుకొండలను ఘనంగా సత్కరించారు. ముందుగా యోగాలో బహుముఖ ప్రజ్ఞశాలి భూపతిరాజు సత్యనారాయణరాజుతో వ్యాస మహర్షికి పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో మైత్రీ కాలనీల ప్రెసిడెంట్ దిరిశాల సత్యనారాయణమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ కమ్మిలి శ్రీరామచంద్రమూర్తి, రాము సెక్రటరీ అడ్డగర్ల ప్రభాకరగాంధీ, బొర్రా మాణిక్యాలరావు, చెరుకువాసు, బావిశెట్టి నగేష్, గ్రంధి నానాజీ, లావణ్య, మాధవి పాల్గొన్నారు.

శక్తీశ్వర స్వామికి విశేష పూజలు



శాకంబరి అలంకరణలో అమ్మవారు

భీమవరం అర్బన్: మండలంలోని యనమదుర్రు గ్రామంలో పార్వతి సమేత శక్తీశ్వర స్వామి ఆలయంలో ఆషాఢ మాస పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం స్వామివార్లకు వివిధ రకాల కాయగూరలు, ఆకుకూరలతో ప్రత్యేకంగా అలంకరించారు. ముందుగా మద్దిరాల సత్యనారాయణ మూర్తి, కొడమంచిలి తమ్మిరాజులు స్వామివార్లకు సహస్రనామార్చన, పంచామృత అభిషేకాలు, గోక్షీరాభిషేకాలతో ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లకు దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి కృష్ణంరాజు పర్యవేక్షించారు.

ఆక్వా సాగుకు వాతావరణ ముప్పు

- వాతావరణ మార్పులతో ఇక్కట్లు
- ఆక్సిజన్ అందక రొయ్యలు మృత్యువాత పడుతున్న వైనం
- తెగుళ్ల దాడితో తీవ్ర నష్టం



గొల్లవానితిప్పలో రొయ్యల చెరువులో ఏరియేటర్ తిప్పుతున్న దృశ్యం

భీమవరం అర్బన్: వాతావరణం హఠాత్తుగా మారి చెరువుల్లోని ఆక్సిజన్ స్థాయి లోపించడంతో మత్స్య సంపద మృత్యువాత పడుతుంది. భీమవరం మండలంలోని కొత్తపూసలమర్రు, దొంగపిండి, నాగిడిపాలెం, లోసరి, వెంప, గొల్లవానితిప్ప, దిరుసుమర్రు, తుందుర్రు తదితర గ్రామాలలో సుమారు 20 వేల ఎకరాలలో వనామీ రొయ్యలు, చేపలు, చేపలు, రొయ్యలు పెంపకం చేస్తున్నారు. అంతేకాకుండా తీర ప్రాంత గ్రామాల్లో సుమారు 12 ఎకరాలలో పండుగొప్పులు పెంపకం చేస్తున్నారు. ఇటీవల నెల రోజులుగా వాతావరణంలో మార్పులు వచ్చి ఆకాశంలో మేఘాలు ఏర్పడటం, పగలు ఎండలు కాయడంతో చెరువుల్లో నీరు చల్లబడిపోయి ఆక్సిజన్, పీహెచ్, అమ్మోనియా, నైట్రోజన్ పరిమాణవుల్లో మార్పులు వస్తున్నాయి. కొన్ని రకాల మేతలు కారణంగా చెరువుల్లోని నీరు, మట్టి నాణ్యత దెబ్బతినడంతో చేపలు, రొయ్యలు, మృత్యువాత పడుతున్నాయి. రొయ్యలు తినగా మిగిలిన మేత చెరువులో అడుగు భాగానికి చేరి కుళ్లిపోవడంతో అమ్మోనియా, నైట్రేట్ వంటి విష వాయులు తయారవుతున్నాయి. చెరువు నీటి నాణ్యతను పెంచేందుకు విషవాయువుల స్థాయి తగ్గించేందుకు జియోలైన్ వంటి మందులను ప్లాంటేషన్ ఉత్పత్తి కోసం రైతులు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోంది.

వెంటాడుతున్న విద్యుత్ కోతలు

రొయ్యలు సాగులో ఆక్సిజన్ స్థాయిని పెంచేందుకు చెరువుల్లో రైతులు ఏరియేటర్లు అమర్చి నిరంతరం తిప్పుతున్నారు. అడ్డు అదుపు లేకుండా విద్యుత్ శాఖ అనధికారికంగా విధించే కరెంట్ కోతలతో ఆక్వా రంగానికి నష్టం ఏర్పడుతుందని రైతులు అంటున్నారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో డీజిల్ వినియోగించి జనరేటర్లతో ఏరియేటర్లు తిప్పుతున్నామని రైతులు వాపోతున్నారు. దీంతో ఖర్చులు అధికమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువుల్లోని ఏరియేటర్ల దగ్గరకు చేరి అధిక మొత్తంలో రొయ్యలు ఆక్సిజన్ అందక చనిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

రొయ్యలు బలహీనంగా ఉండటంతో వ్యాధులు దాడి

చెరువులో ఆక్సిజన్ సక్రమంగా అందక చేపలు, రొయ్యలు బలహీనంగా ఉండటంతో బాక్టీరియా వైరస్ వ్యాధులు వాటిపై దాడి చేస్తున్నాయి. రైయ్యల్లో వైట్ స్పాట్, విబ్రియో వంటి వ్యాధులు, చేపల చెరువలో రెడ్ డీసీజ్, తాటాకు తెగులు, పేను తదితర వ్యాధులు అధికంగా ఉండటంతో వాటి నివారణకు మందులకోసం అధికంగా ఖర్చు చేయా ల్సి వస్తుందని ఆక్వా రైతులు వాపోతున్నారు.

> **ఆక్సిజన్ స్థాయి పడిపోతుంది**
>
> అధిక ఉష్ణోగ్రతలతో పాటు కరెంట్ కోతలు అధికంగా ఉండటంతో చెరువుల్లోని ఆక్సిజన్ స్థాయి తరచూ పడిపోయి చేపలు, రొయ్యలు నీటిపైకి వచ్చి ఈదుతున్నాయి. చెరువుల్లోని రొయ్యలు, చేపలు నీటి ఉపరితలంపై ఈదుతూ చనిపోతున్నాయి.
>
> – వాటాల విజయకృష్ణ, ఆక్వా రైతు, నాగేంద్రపురం

ఘనంగా గరుడ వాహన సేవ



స్వామివారికి గరుడ వాహన సేవ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని దంతులూరి జగన్నాథరాజు సత్రం అనుబంధ సంస్థ పద్మావతీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో గురువారం ఆషాడ మాసం పౌర్ణమి సందర్భంగా స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం గరుడ వాహన సేవను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



భీమవరం హౌసింగ్ బోర్డ్ కాలనీలోని సాయిబాబా మందిరంలో పూజలు చేస్తున్న దృశ్యం



దత్త క్షేత్రంలో గురువులను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలోని సాయిబాబా మందిరంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మల్లినీడి సుధాకర్ ఆధ్వర్యంలో బాబాకు మందిరం ప్రధాన అర్చకుడు పి.నారాయణ శేషకుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు సాయిబాబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఆకివీడులో..

ఆకివీడు: గురుపౌర్ణమి సందర్భంగా గురువారం పలు దేవాలయాల్లో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక దత్త క్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో గురు బలంతోనే ఎంతటి సమస్యనైనా పరిష్కరించవచ్చని స్థానిక దత్త క్షేత్ర కార్యదర్శి కంభంపాటి త్రినాథ కృష్ణమూర్తి చెప్పారు. దత్తాత్రేయుడు 24 గురువుల అవతారమన్నారు. సమాజానికి ఉపయోగపడే ప్రతి వ్యక్తీ గురువేనని బోధించారు. ఆలయ ప్రాంగణంలో దత్త హోమం, పూర్ణాహుతి చేశారు. ప్రముఖ వేద పండితులు, పరీక్షాధికారి గుళ్లపల్లి శివ శర్మ శాస్త్రిని ఘనంగా సత్కరించారు. స్థానిక రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సాయిబాబాకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఆలయ కార్యదర్శి కాకర్ల రాజరాజేశ్వరిని పలువురు విద్యార్థులు, స్థానికులు సత్కరించారు. గుమ్ములూరు రోడ్డులోని సాయి మందిరంలో బాబాకు ప్రత్యేక హారతులు, పూజలు చేసి, గురుపూజోత్సవం నిర్వహించారు. పతంజలి యోగారోగ్య కేంద్రంలో యోగా గురువు కందుల సత్యనారాయణ దంపతులను సత్కరించారు.

పేలవంగా పేరెంట్స్ సమావేశం



ఉండి: వెలివర్రులో తూతూ మంత్రంగా సాగుతున్న పేరెంట్స్ మీట్



ఆకివీడు: జెడ్పీ హైస్కూల్‌లో అతి తక్కువగా హాజరైన తల్లిదండ్రులు

ఆకివీడు: ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశానికి పలు పాఠశాలల్లో తల్లిదండ్రులు అధిక శాతం గైర్హాజరయ్యారు. విద్యార్థులు వందల్లో ఉంటే తల్లి దండ్రులు వేళ్లపై లెక్కించే విధంగా హాజరయ్యారు. గురువారం ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించాల్సి ఉండగా మధ్యాహ్నం 12.30 నిమిషాల వరకూ సభ జరగలేదు. దీంతో విద్యార్థులు విసుగు చెందారు. హాజరైన తల్లిదండ్రులు కొంత మంది వెనుదిరిగారు. కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులు వచ్చేంత వరకూ సమావేశాన్ని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించలేదు. దీంతో మధ్యాహ్న భోజన సమయం అవ్వడం, విద్యార్థుల్ని కూర్చోబెట్టేందుకు ఉపాధ్యాయులు తలలు పట్టుకున్నారు. స్థానిక జెడ్పీ స్కూల్‌లో 1000 మందికి పైగా విద్యార్థులుంటే కేవలం 60 మంది కూడా విద్యార్థుల తల్లిదండ్రులు హాజరుకాని పరిస్థితి ఏర్పడింది. సమావేశానికి హాజరైన నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, ఆ వార్డు కౌన్సిలర్ కట్టా రవీంద్రనాథ్ ఠాగూర్ లు కూడా కూటమి నాయకులు వచ్చేంత వరకూ వేచి ఉండాల్సి వచ్చింది. విద్యార్థులు ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వివిధ వేషధారణల్లో వచ్చినప్పటికీ సకాలంలో కార్యక్రమం నిర్వహించకపోవడంతో నిరుత్సాహం చెందారు. సమావేశం అనంతరం స్థానిక పిల్లల వైద్యులు కలిదిండి మహేష్ వర్మ విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. హెచ్ఎం పారనాయుడు పాల్గొన్నారు.

స్పందన అంతంతమాత్రమే

ఉండి: ప్రచార ఆర్భాటాలకే మెగా పీటీఎం(పేరెంట్స్, టీచర్స్) సమావేశాల పరిమితమయ్యాయి. గురువారం మండల వ్యాప్తంగా నిర్వహించిన మెగా పీటీఎం సమావేశాలకు తల్లిదండ్రుల నుంచి అంతగా స్పందన లేకపోవడంతో కూటమి నాయకులే కుర్చీలను అలంకరించారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ భవనాలుగా తీర్చిదిద్దితే అదంతా తమ అభివృద్ధే అని చెప్పుకునేందుకు కూటమి నాయకులు వెనుకాడలేదు. ప్రభుత్వ పాఠశాలలకు తాగునీరిచ్చాం..విద్యుత్ ఏర్పాటు చేశాం.. ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం అన్నీ ఇస్తున్నామని అబద్ధాలు ప్రచారం చేసేందుకు ఎంత ప్రయత్నించినా తల్లిదండ్రులు ఎవ్వరూ నమ్మకపోగా నవ్వుకున్నారు. కూటమి నాయకుల ప్రాభవానికే అధికారులు కూడా పాకులాడటంతో కార్యక్రమాన్ని తూతూ మంత్రంగానే నిర్వహించి చేతులు దులుపుకున్నారు.

కోర్టుల్లో మధ్యవర్తిత్వం ప్రాముఖ్యత పెరుగుతుంది



న్యాయవాదుల సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి లక్ష్మీనారాయణ

భీమవరం: మధ్యవర్తిత్వంపై న్యాయవాదులు, కక్షిదారులు అవగాహన పెంచుకోవాలని రానున్న రోజుల్లో కోర్టుల్లో మధ్యవర్తిత్వం ప్రాముఖ్యత పెరుగుతుందని భీమవరం మూడవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాసంస్థ చైర్మన్ బి లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం పోక్సో కోర్టులో ఏర్పాటుచేసిన మధ్యవర్తి న్యాయవాదులు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, కక్షిదారులకు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో ఆదేశాల మేరకు ఈనెల 16వ తేది వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యవర్తిత్వ న్యాయవాదులు ఆర్ హరి, కేబీ రాజశేఖర్, జీవీ స్టీఫేన్‌బాబు, కె విజయలక్ష్మి, ఎస్ సుబ్బారాయుడు, ఎస్ మాణిక్యాలరావు, ప్యానల్ న్యాయవాదులు బి సురేష్ కుమార్, డి రవికుమార్, కె జ్యోతి, బి లోకేశ్వరరావు, ఎంబీ భవాని, ఎస్‌సుదీర్, పి అంబేడ్కర్ పాల్గొన్నారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీపీ, పాల్గొన్న వైస్ ఎంపీపీలు

ఉండి: ప్రస్తుత వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తంగా వుండాలని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు నివేదికలను చదివి వినిపించారు.అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా గ్రామపంచాయతీ కార్యదర్శులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలువకుండా చూడాలని, అలాగే పారిశుద్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అన్నారు. ప్రజలకు రక్షిత మంచినీటి సరఫరా ద్వారా అందించే తాగునీరు సురక్షితంగా కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో ఎంవీఎస్ఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ పీ–4 పథకం ద్వారా మండలంలో 6913 కుటుంబాలను బంగారు(నిరుపేద) కుటుంబాలుగా గుర్తించామని ఆయా గ్రామాల వారీగా మండలంలో 750 మంది మార్గదర్శులను (దాతలు) సమకూర్చి వారి పేర్ల వివరాలను ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు గుత్తుల కనకమహాలక్ష్మీ, దత్తాల సుజాతరాణీ, ఎంపీడీఓ ఎంవీఎస్ఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గీత వృత్తిని నాశనం చేస్తున్న కూటమి ప్రభుత్వం

నరసాపురం: రాష్ట్రంలో గీత వృత్తిని కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నాశనం చేస్తుందని ఏపీ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నర్సింహమూర్తి విమర్శించారు. గురువారం స్థానిక మీరా గ్రంతాలయ భవనంలో నిర్వహించిన సంఘం నరసాపురం డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా కల్తీ మద్యం ఏరులైపారు తుందని అన్నారు. అలాగ పట్టణాలు, గ్రామాలు అనే తేడాలేకుండా వీధివీధినా బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా పెట్టినా ఎక్సైజ్ శాఖ చోద్యం చూస్తుందని విమర్శించారు. కూటమి సర్కార్ విధానాలతో సంప్రదాయ కల్లుగీత కార్మికులు ఉపాదిలేక రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు గీత కార్మికుల సంక్షేమంపై అనేక వాగ్దానాలు చేసిన కూటమి సర్కారు ఇప్పుడు గీత కార్మికులను నిండా ముంచిందన్నారు. సంఘ నాయకులు బొక్కా చంటి, గుబ్బల నాగరాజు, దొంగ వెంకటేశ్వర్లు, పంపన శ్రీను పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ ఫెన్సింగ్ టోర్నమెంట్‌కు భీమవరం క్రీడాకారులు



భీమవరంలో ఫెన్సింగ్ క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం పట్టణానికి చెందిన క్రీడాకారులు ఇంటర్నేషనల్ ఫెన్సింగ్ టోర్నమెంట్‌కు ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఆగస్టు 1వ తేదీన థాయిలాండ్‌లో నిర్వహించే ఇంటర్నేషనల్ ఫెన్సింగ్ టోర్నమెంట్‌కు విశ్వకవి స్కూల్ విద్యార్థులు ఎం హర్షిత్ శ్రీవర్మ, కె అన్యబెన్ ఎంపికైన సందర్భంగా గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో క్రీడాకారులను అభినందించి ఒక్కొక్కరికి రూ. 20 వేలు చొప్పున ప్రోత్సాహం అందజేశారు. స్కూల్ డైరెక్టర్ పొట్లూరి రఘుబాబు మాట్లాడుతూ ఏపీ స్టేట్ చైల్డ్ అండర్ -10 బాలుర విభాగంలో ఎం హర్షిత్ శ్రీవర్మ, బాలికల విభాగంలో కె అన్య బెన్ స్టేట్ ద్వితీయ స్థానంతోపాటు మహారాష్ట్రలో జరిగిన ఆలిండియా ఫెన్సింగ్ అండర్ - 10 లో సిల్వర్ మెడల్, ద్వితీయ స్థానం సాధించి థాయిలాండ్‌లో జరిగే ఇంటర్నేషనల్ ఫెన్సింగ్ టోర్నమెంట్‌కు అర్హత సాధించారన్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

ఉండి: వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ఉండి పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం ఉండి మండలం పాములపర్రు గ్రామానికి చెందిన పిల్లి కేశవరావు అనే వ్యక్తి గత నెల 22న రాత్రి 8:30 గంటలకు తన భార్యతో గొడవపడి డాబాపై నుంచి కిందికి దిగివస్తుండగా పిల్లి శ్రీనివాస్, నలుగురు వ్యక్తులు పాత గొడవల నేపథ్యంలో అతనిపై దాడి చేశారు. తననకు చంపుతానని బెదిరించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఫిర్యాదుపై ఏఎస్సై ఎం.మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానసిక ప్రశాంతతనిచ్చేది ఆధ్యాత్మిక చింతనే

భీమవరం: మానసిక ఒత్తిడిని దూరం చేసి ప్రశాంతతనిచ్చేది ఆధ్యాత్మిక చింతనేనని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా గురువారం 36వ వార్డు బైపాస్ రోడ్డులోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి మహోత్సవాలను అంజిబాబు పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. ముందుగా బాబావారికి పంచామృతాలతో అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమాలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు ఉండపల్లి రమేష్‌నాయుడు, అధ్యక్షుడు చల్లా రాము మాట్లాడుతూ ఈనెల 17న అన్న సమారాధన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బండి రమేష్‌కుమార్, వబిలిశెట్టి రామకృష్ణ, చింతలపాటి బంగార్రాజు, చెరుకువాడ రంగసాయి,ఎంవి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ 165 భూసేకరణకు ఆమోదం



అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): జాతీయ రహదారి 165 నిర్మాణంలో భాగంగా ఉండి మండలం పెద్ద పుల్లేరు గ్రామం రైతులు లేవనెత్తిన అభ్యంతరాలపై జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి గురువారం జాతీయ రహదారుల అధికారుల సమక్షంలో విచారణ నిర్వహించారు. భూసేకరణపై జూన్ 14న అభ్యంతరాలు గడువు ముగియడంతో, ఆ గ్రామం నుంచి అందిన ఐదు అభ్యంతరాలపై ఈరోజు విచారణ నిర్వహించారు. ముఖ్యంగా మూడు అంశాలపై రైతులు అభ్యంతరాలను వ్యక్తపరచగా వీటిని ఎన్.హెచ్ అధికారులు పరిష్కరించేందుకు రైతులకు హామీ ఇవ్వడంతో రైతుల అభ్యంతరాలను ఉపసంహరించుకుని, భూ సేకరణకు ఆమోదం తెలిపారు. ఈ విచారణలో ఎన్.హెచ్ ఈఈ సంజీవ నాయుడు, డిఇ శ్రీనివాస్, పెద్ద పుల్లేరు రైతులు, కలెక్టరేట్ ల్యాండ్ సూపరింటెండెంట్ సీహెచ్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాళ్ల: మండలంలోని బోస్ కాలనీ 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఆర్‌డీఎస్ఎస్. స్కీములో భాగంగా నూతన 11 కేవీ లైన్ ఏర్పాటు పనులు నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బోస్ కాలనీ, కలవపూడి, మోడి, మాలవానితిప్ప, గోగుతిప్ప, ఆనందపురం, ఇస్కుల్లంక, మేకలదిబ్బ, గూట్లపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేశారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆకివీడులో..

ఆకివీడు: మండలంలోని చినకాపవరం విద్యుత్ ఉప కేంద్ర పరిధిలో లైన్ క్లీయరెన్స్ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. చినకాపవరం, పెదకాపవరం, దండగర్ర, గొల్లగూడెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

భీమవరంలో..

భీమవరం: భీమవరం పట్టణం ఇండస్ట్రియల్ ఏరియాలోని విద్యుత్ సబ్‌స్టేషన్ మరమత్తులు, కొత్త విద్యుత్ తీగల మార్పిడి కారణంగా పలుప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా విలిపివేస్తున్నట్టు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చినరంగనిపాలెం, హౌసింగ్ బోర్డు,పిపి.రోడ్, నరసయ్య అగ్రహారం, మారుతినగర్, మల్లితోట, బొక్కవారిపాలెం, రామచంద్రాపురం ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని వెంకటేశ్వరరావు కోరారు.

సాగునీరు అందక ఎండుతున్న నారుమడులు



ఎండుతున్న నారుమడులను చూపుతున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: మండలంలో సాగునీరు అందక వరి నారుమడులు ఎండుతున్నాయని సీపీఎం మండల కార్యదర్శి షేక్ పాదుషా ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పెనుగొండ మండలం నడిపూడి, చినమల్లంల్లో సాగునీరు అందక ఎండుతున్న వరి నారుమడులను పరిశీలించారు. సాగు ప్రారంభంలోనే నీటి ఎద్దడి ఎదుర్కొనడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. ముఖ్యంగా కోడేరు బ్యాంకు కెనాల్ పరిధిలోని నడిపూడి, చినమల్లంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందన్నారు. సాగునీటి ఎద్దడిపై తహసీల్దారు జి.అనితకుమారికి ఫోన్‌లో సమాచారం అందించడంతో, నీటి ఎద్దడిని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలంటూ స్థానిక వీఆర్వో వద్దకు వెళ్లమని చెప్పడంతో రైతులు వెళ్తే హేళనగా మాట్లాడారని ఆరోపించారు. చివరకు నీటి సంఘం డైరెక్టర్లు కూడా పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతుల విషయంలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ కరువైందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా సాగు నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు చిలుకూరి ముఖర్జి, కుడిపూడి ఉపేంద్ర, ముద్దల కిరణ్, మట్టపర్తి నాగరాజు, లాగా సత్యనారాయణ పాల్గొన్నారు.